★ ముందుమార్గం ★

శ్రీ పేకుమళ్ల కామేశ్వరరావు.

గాంధీమహాత్ముని సత్యాగ్రహయుద్ధంలో పాల్గొన్న ఒక సైనికుడు మాత్రమే సత్యనాధరావు. అతను పేరు ప్రతిష్ఠలకోసం - ఆ ఉద్యమంలో చేరలేదు ధర్మచింతన వల్లా, ధర్మమే జయించాలన్న పట్టుదలవల్లా ఆ ఉద్యమంలో చేరేడు 1942 లో 'భారతదేశం విడిచిపొండి సంక్షోభంలో జైలు శిక్షను పొందేడు జైలునుంచి వచ్చినప్పుడైనా అతని మెడను పూలదండలు అలంకరించలేదు ఆఖరికి పత్రికలలో పేరేనా పడలేదు

సత్యనాధరావు స్థితిమంతుడుకాడు, పెద్దచదువు చదివినవాడు కాదు. ప్రాపకంలేదు పైగా ధ్యానము, తపస్సు అంటాడు పొలంమీద వచ్చే గింజలు తిండికే చాలవు. నిత్యజీవనం ఇబ్బందిగాఉంది అది రోజురోజుకు భారమవుతూంది.

అతని భార్య సుగుణవతి బుద్ధిమంతురాలనే చెప్పాలి. కాని భర్త యొక్క అభిప్రాయాలన్నింటికీ బుర్ర ఆడించదు ఉన్నపరిస్థితులలో వీలైనంతమట్టుకు గడుపుకొనిపోతుంది అంతగా మినుమిక్కిలయితే మనస్సులో మాటను మాత్రం దాచిపెట్టదు ఇంటిలో ఫలానా వస్తువు లేదని ఆమె భర్తతో అనగా, అతను 'మన మొక్కళ్ళమేకాదు కోట్లకొలదిమంది లేమిని అనుభవిస్తున్నారు! మనమెంత మనబతుకెంత' అంటాడు. కార్యక్రమంలేని ఉపవాసాలు తప్పవు !

ఇరుగు పొరుగు అమ్మలక్కలు తమ ఆధిక్యతను వెల్లడించుకొని ఆనందించుకోక మానరు 'సుగుణవతికి ముక్కుపుడకేనా లేదమ్మా !' అని ఒకర్తె, 'చెవులకు గుడ్డిదుద్దుల జతేగాని మరొకటి లేదని' ఇంకొకరు 'మెడలో ఒక్క నానుపేటేనా లేద'ని మరొక ఇల్లాలు, 'ఇప్పుడిన్నిన్ని రకాల మంచి మంచి చీరెలు. రవికెల గుడ్డలు వస్తూంటే చక్కగా కొనుక్కోరాదా?' అని వేరొకసుందరి, ఈ మోస్తరుగా ఎవరో ఒకరు ఏదో ఒకటి అనక మానరు కాని సుగుణవతి ఏ జవాబూ చెప్పదు కడుపులోనె దాచుకొంటుంది కాని అవి ఇమడక భర్తముందు ఎప్పుడో ఒకప్పుడు భళ్లున ఇవతలపడతాయి

ఆరోజున తగినంత కారణంలేదు, అగ్నిపర్వతం బద్దలయింది

"మీచేతితోటి మీరు ఆఖరికి. ఇదిగో నీకు ముక్కుపుడక అనేనా చేయించిన పాపాన్ని పోయ్యేరా?" అంది సుగుణమ్మ

"సరే! ఇప్పుడామాట ఎందుకు వచ్చింది?" అని తెలియగోరేడు భర్త

"ఉన్నపాటివాళ్ళు చూడండి, ఎలాగు- దిగవేసుకొని, చాతీవిరుచుకొని తిరుగుతున్నారో?" అంది సుగుణవతి.

"స్త్రీకి పాతివ్రత్యమొక్కటే భూషణమని చాలాకాలం క్రిందటే మహాభారతంలో చెప్పేడు సరే! అదట్లా గుంచు! ఎక్కడేనా పాతొక్కటి ఉందనుకొన్నావా పెల్లగించుకొని రావటానికి!" అన్నాడు భర్త

"ఏమీ! చక్కగా ఏదో కోమటికొట్టుమీద గుమాస్తా పని చేసుకోరాదూ?"

ఇప్పుడు రోజులు తినో తినకుండానో గడిచిపోతున్నాయా లేదా?

"అదా ఏమిటి, బతుక్కు! కడుపుకి ఇంత లగ్గు తినగానె సరా! గౌరవముండాలి! మూసివాయనం ముత్తయిదువులాగు చేసిపెడితే ఏమిగౌరవముంటుంది!"

"నగలు నగలో అంటావుకాని నగలవల్ల ఉండే ప్రమాదాలు నువ్వు గ్రహించినట్లు కనబడదు. ఒకరోజు వేషానికి గడ్డాలు, మీసాలు తెగగొరుక్కున్నాడని సామెత రోజులు బాగుండకపోతే బుర్రబద్దలవడం ఒకటి, నగలెత్తుకుపోవడం రెండు, ఒకేసారి రెండు శిక్షలు !"

"మీలాటివాడే ఎవడో పరుగెత్తలేక బలాదూరన్నాట్ట!"

"నేనొక మాటడుగుతాను చెప్పమా ఇంతకీ నగలు నాణేలు ఎవరుచూసి సంతోషించడానికి?"

"అదంతా నాకు తెలియదు వాళ్ళు వీళ్ళు చూసి సంతోషించడానికా లేక ఇంటిలోవాళ్లు చూసి సంతోషించడానికా? ఇంటిలోవాళ్ళు చూసి సంతోషించడానికే అనేమాటుంటె,

అవీ లేకపోయినా కూడ నాకు సంతోషమే!" అన్నాడు సత్యనాధరావు నవ్వుతూ

''సిగ్గులేని మొహానికి నవ్వే సింగారంట!'' ''ఈమాత్రం ఎరగరుకాబోలు వేసుకొనేవారంతా'' అంది సుగుణవతి

అది తెగని వాదం

సుగుణవతి తన వాదనలోని న్యాయాన్ని బలపరచడానికి ''ఆడపిల్లలు, వాళ్ళు ఆ పట్టు పరికిణీలు కొనుక్కున్నారు. వీళ్ళు ఈ పట్టు జాకెట్టు తొడుక్కున్నారు అని ఒకటేపోరు పెడుతున్నారు ఆఖరికి వాళ్ళకి శాటిన్‌వేనా కుట్టించి పారెయ్యడానికి గతిలేకపోయిందా?" అని ప్రశ్నించింది

"ఎందుకు? వాళ్ళకి గౌనులున్నాయికదా?''

''ఇప్పుడు గౌనులు తొడగడం పాషన్‌కాదు పరికిణీ, జాకెట్టు కట్టుకుంటున్నారు ఎవరుపట్టినా!''

పాషన్లు అన్నవి డబ్బున్నవాళ్ళకిగాని నీబోటివాళ్ళకి నాబోటివాళ్ళకికావు నాకేమేనా పాషన్లు ఏడిచేయేమో చూడు! బట్టలువేసుకోవడం అందంకోసంకాదు. మానం కాపాడుకోడం కోసం'' అన్నాడు భర్త.

భార్య ఆమాటలు పెడచెవినిపెట్టింది. ఎవరి ఓపిక కొద్దీ వారు వాదించుకొని ఆరిపోయిన చిచ్చుబుడ్లలాగు ఊరుకొన్నారు.

సత్యనాధరావుకి అదొక పెద్ద సమస్య అయింది "నా ఆదర్శాలకోసం భార్యాపుత్రులను బలిదానం చెయ్యడం మంచిదా కాదా? నిజంగా ఆమె నా ఆదర్శాలతో నూటికి నూరుపాళ్ళు ఏకీభవించదు. ఆమాటికివస్తే లోకంలో ఏ ఇల్లాలూ నూటికి నూరుపాళ్ళు భర్తతో ఏకీభవించదు కాబట్టి అది ప్రశ్నేకాదు నేను సంపాదించలేదు, సంపాదించలేను అని కదా అంటుంది నాకు సాధ్యమైనంత మట్టుకు కుటుంబపోషణ చేస్తూనే ఉన్నాను అంతకంటె చెయ్యలేను. నాకు దేశసేవ అతి ముఖ్యం అటువంటప్పుడు భార్యా పుత్రులు, నేను, రెండో పక్షమే! కాని తెలుగుదేశంలో ఎవ్వరికీ అక్కరలేని దేశసేవ నీకు మాత్రం ఎందుకయ్యా అంటే, నేను నా అంతరాత్మ ప్రబోధాన్ని విడిచిపెట్టను. స్వలాభ పరాయణత్వంలో మునిగిపోను. నాకు సంఘక్షేమం ప్రధానం. ఎవరు నన్ను చెయ్యవద్దంటారు? ఇప్పుడు నేను ఆఖరికి నా భార్యమాటలైనాచెవినిపెట్టను''' అనిఅనుకొన్నాడు ఇంతటిలోఅతనికి వెనక తన జాతకంచూసి, జ్యోతిష్కుడు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చేయి. 'నా జాతకంలో కంచుకాగడా పెట్టి వెతికినా ధనసంపాదన లేదట! ఏ మనిషి జాతకంలోని ముఖ్యాంశమైనా ధనసంపాదనయేనట! నాది దుష్టగ్రహాలు పట్టి పీడిస్తున్న జాతకమట! ఆఖరికి వట్టి దరిద్రగొట్టు జాతకమని స్థిరపరిచేడు డబ్బుసంపాదన ఒక్కటే జీవితాదర్శమని తేల్చేడు సంఘం ఎంత అధోగతిలో ఉన్నా, దేశం ఎంత అధోగతిలో ఉన్నా మనం చెయ్యవలసిన పని ఆత్మలాభమే అన్నమాట! దేశసేవ, సంఘసేవ, త్యాగం, సత్యవాక్పరిపాలనం, తపస్సు వీటి అన్నింటిమాట ఏమిటి? ఈమనుష్యులకు వ్యష్టి దృష్టేకాని సమిష్టి దృష్టిలేదు. తాను ముఖ్యం కాని సంఘం ముఖ్యంకాదు ఇటువంటి సంకుచిత దృష్టిగల మానవులున్న సంఘానికి అభివృద్ధి ఎక్కడిది? అజ్ఞానపు ఆశయాలవల్ల దేశం అధోగతికి పోతూంది'' అంటూ సత్యనాధరావు గోండ్రించేడు

పెరుగు మనిషి, కూరల మనిషి బాకీ డబ్బులిమ్మంటూ గుమ్మందగ్గిర నిల్చున్నారు అతను త్వరలోనే బాకీలు తీరుస్తానని సమాధానం చెప్పి పంపించేశాడు

అప్పులవాళ్ళ రాకవల్ల నిత్యజీవితంలోని బాధలు మూర్తీభవించినట్లుగా కనిపించేయి ''ఈ బాధలు భరించరానివి! ఇవి లేకుండా గడిచే మార్గం కనబడదు బతుకు తీరినప్పుడే ఇవి తీరేటట్లు కనబడుతుంది నిత్యజీవితంలోని బాధలు తీరడం కోసం ఏదేనా ఉద్యోగంలో చేరదామంటే, దేశసేవ ఉదరపూజగా రూపొందుతుంది. వీటి బాధచూస్తే తట్టుకోడానికి సాధ్యం కావడంలేదు! హే పరమేశ్వరా!" అని విచారించేడు

కిందటివారం స్వపట్టణమైన విజయవాడకి పొరుగు గ్రామంమీద కమ్యూనిష్టులు జరిపిన దాడి సంగతి జ్ఞాపకానికి వచ్చింది 'ఆ దాడిలో అయిదుగురు అమాయకపు గ్రామస్థులను తుపాకులతో కాల్చి చంపేరు, పదివేల రూపాయల సొత్తును దోచుకుపోయేరు. మనుష్యుడు! సోదర మానవుల ఎడల ఎంత దారుణంగా ప్రవర్తించేడు కొందరి రాజకీయాదర్శాలు ఎంత వికార రూపం దాల్చేయి!'' అని విచారించేడు

ముందు మార్గం

సత్యనాధరావు స్నేహితులైన పరమేశ్వరం, వాక్పతి వీధి గుమ్మందగ్గరకి వచ్చి కేక వేసేరు సత్యనాధరావు దుస్తులు వేసుకొని బయటికి వచ్చేడు. అందరూ కలిసి ఊరిబైటికి షికారు పోయేరు అక్కడ పచ్చని చేలగట్ల మీద కూర్చున్నారు.

"రాజకీయ బాధితుణ్ణి అంటూ ఒక దరఖాస్తేనా పారే శావుకాదోయ్ నువ్వు!" అన్నాడు వాక్పతి సత్యనాధ రావుని చూసి.

"నన్ను దరఖాస్తు పెట్టనిచ్చి తీరా వాళ్లు కాదని తోసి వేస్తే! 'ధనమూ పాయెను, మానమూ చెడెను' అనే తిరుపతికవుల పద్యం జ్ఞాపకానికి వస్తుంది నేను సహా యానికి తగిన వాణ్ణని తోచితే వాళ్ళకి, ఏ ప్రార్థనా అక్కర లేకుండానె పని జరుగుతుంది!" అన్నాడు సత్యనాధరావు

"అడిగితేగాని అమ్మెనా పెట్టదని శాస్త్రం!" అన్నాడు వాక్పతి.

"పోనీ అని శాసనసభల ఎన్నికలకేనా అభ్యర్థిగా నిల బడ్డావుకాదు?" అన్నాడు పరమేశ్వరం బాధగల మనస్సుతో

"ఏమీ? అభ్యర్థులు లేక దేశం గొడ్డువోయిందనా? డెపోజిట్లుకూడ ధారవోసుకోడానికి సిద్ధపడినవాళ్ళుండగా మధ్యని నేనుకూడ ఎందుకు? దండగ! ఎవ్వరూపోటీ చెయ్యని సత్కారమేదేనా చేసుకోరాదూ?" అన్నాడు సత్యనాధరావు

"ఈకాలంలో ఎవ్వడూ పోటీ చెయ్యనిపని ఒక్క తపస్సే!" అన్నాడు వాక్పతి

"నీ ఉద్దేశం, ఇటు సంసారం, తప్పితే అటు ముక్కు మూసుకు కూర్చోడం. అంతేకాని మరొక దారి లేదనా?" అని అడిగేడు సత్యనాధరావు

"ఔను!" అన్నాడు వాక్పతి

"సాంఘిక సేవ అనే ఉత్తమమార్గమొకటుంది ప్రతి ఫలాపేక్ష లేకుండా దేశాన్ని బాగుచేయవోయ్ ప్రబుద్ధుడా!" అన్నాడు సత్యనాధరావు

"అది చెప్పినంత సులభసాధ్యం కాదు నాయనా!" అన్నాడు వాక్పతి

"ఆమాట నిజమే! బహు కష్టసాధ్యమైనది. దానికి తగినట్లుగానె సంఘం మీద ఫలితాలుకూడ అమోఘం! అంతకంటె మంచిపనేముందోయ్!" అన్నాడు సత్య నాధరావు.

"కాకపోయినా అధర్మం మహా ప్రబలంగా ఉందంటే నమ్ము. పైగా నీలాగు సంఘసేవ చేస్తాననేవాణ్ణి పట్టి పిచ్చివాడిగాకట్టేస్తారు నలుగురూ!" అన్నాడు పరమేశ్వరం

"దానినిబట్టి చూసుకో మనుష్యుల ఆలోచనలు ఎంత అపసవ్యంగా ఉంటున్నాయో? అజ్ఞానం ఎంత ఆవరించి ఉందో? నారాయణ అంటే బూతుమాటగా ఉంది! ఇటు వంటి దుర్దశలో ధర్మప్రచారంకంటె మరొక ఉత్తమమైన పనిలేదు బాబూ!" అన్నాడు సత్యనాధరావు.

"మధ్యని మనకి ఈ హిందీ గడబిడ ఒకటి వచ్చి పడింది కదా!" అన్నాడు వాక్పతి.

"మనకి అన్నీ ఒకలాగే దాపురించేయి, పతితజాతికి ఉండవలసిన అవలక్షణాలన్నీ పూర్తిగా పట్టేయి. హిందీ మనదేశభాషలను కబళించడానికి సిద్ధంగా ఉంది సంస్కృత భాషను తొలగించి తాను ఆస్థలం ఆక్రమించుకోవాలని చూస్తూంది హిందీ కనక గెలుపొందితే, హిందీ ఇతర దేశభాషలను దిగమింగినట్లే హిందీయులు మనని అన్నివిధాల అణగద్రొక్కక మానరు అది మానవలక్షణం, దానిని 'కాదు, పోదు' అంటే అయేదేమీలేదు కాబట్టి మనం ఆత్మరక్షణ చేసుకోవాలి... హిందీని అవతలకు తరిమి వెయ్యాలి సంస్కృతాన్ని రాజభాషగా స్థిరపరుచుకోవాలి" అన్నాడు సత్యనాధరావు

"నీ అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను" అన్నాడు పరమేశ్వరం.

"ఔను!" అన్నాడు వాక్పతి

"నీ ప్రచారం దిగ్విజయంగా జరుగుగాక అని పరమే శ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను" అన్నాడు పరమేశ్వరం

"తథాస్తు!" అన్నాడు వాక్పతి

సంధ్య చీకట్లను చీల్చుకొంటూ తూర్పువైపున చంద్ర బింబం ఆకాశం మీదికి పాకుతూంది చల్లని గాలికి చెట్లు ఆనందించి గలగలమని చిరునవ్వు నవ్వుతున్నాయి. చీకట్లు వదలి వెన్నెల వ్యాపిస్తూన్నందుకు పక్షులు కలవ రిస్తున్నాయి. మిత్రులు ఇంటికిపోదామని లేచారు

★